క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంపాటి అపర్ణ

సత్తుపల్లిటౌన్: వేసవి తీవ్రత దృష్ట్యా కోర్టు ప్రాంగణానికి వచ్చే కక్షిదారుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని 6వ అదనపు జిల్లా జడ్జి వెంపాటి అపర్ణ అన్నారు. సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆదియ్య(ఆడమ్స్) ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.లావణ్య, న్యాయవాదులు పిన్నం జానికి రామామారావు, ఎస్‌కె బుజ్జీసాహెబ్, కృష్ణప్రసాద్, లక్ష్మణరావు, జి.భద్రం, ఎం.వెంకటేశ్వరరావు, ఎంవి కృష్ణ, పి.రత్నాకర్, వి.రామకృష్ణ, పివిజీబీ భాస్కర్, జినత్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి

ముదిగొండ: మండలపరిధిలోని గోకినేపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి శుక్రవారం పరిశీలించారు. గ్రామం సమీపంలోని పంట కాలువల పూడిక తీత పనులు చేస్తున కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో 350మంది ఉపాధిహామీ కూలీలు హాజరౌతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఈ నెల 21న గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష

వైరా:తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులలో చేరుటకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రమ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు గురుకుల వెబ్ సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల ప్రభంజనం..

గుట్టబడి విద్యార్థులకు గురుకుల సీట్లు

వైరా: వైరాలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల (గుట్టబడి) విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించి ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెంది న 41 మంది బాల బాలికలు గురుకుల పరీక్షలకు హాజరు కాగా వారిలో 37మంది అత్యధిక మార్కులు సాధించి గురుకుల సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగబత్తిన భాస్కరరావు, ఉపాధ్యాయులు గృహలక్ష్మి, భాస్కరాచారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

నూరుశాతం ఫలితాలు సాధించిన టీఎల్‌పేట విద్యార్థులు..

ఏన్కూరు: మండల పరిధిలోని తూతకలింగన్నపేటకు చెందిన విద్యార్థులు గురుకుల విద్యాలయాల్లో ఐదో తరతగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ ప్రతిభ కనబరిచారు. 12 విద్యార్థులు పరీక్షలు రాయగా 12 మంది సీట్లు సాధించారు. ఏన్కూరు, వైరా, రెబ్బవరం, బూర్గంపహాడ్ గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించారు. వీరంత టీఎల్‌పేటలో జుజ్జూరి కృష్ణమాచారి దగ్గర శిక్షణ తీసుకొవడంతో.. ఆయనను విద్యార్థులు.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు అభినందించారు.

ముగిసిన ట్రాక్టర్ రివర్స్ పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామంలో శ్రీఅంకమ్మతల్లి, మహాలక్ష్మి తల్లుల తిరునాళ్ల మహోత్సవ సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు మండల స్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 25 టీములు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సఖీనవీడు గ్రామానికి చెందిన మల్లారపు శ్రీనివాసరావు, చిన్నం రామకృష్ణ, యరమల నర్సిరెడ్డి టీమ్‌లు గెలుపొందాయి. విజేతలకు ఈ నెల 21న బహుమతులు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, యరమల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ర్యాలీ

ఏన్కూరు: ఖమ్మంలో జరిగే కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రోడ్‌షోలో పాల్గొనేందుకు మండలంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఖమ్మం తరివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి బీజేపీ అభిమానులు, కార్యకర్తలు మండల కేంద్రానికి చేరుకొని అక్కడ నుంచి ర్యాలీ నిర్వహిస్తు ఖమ్మం వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవ్వూరి నాగేశ్వరావు, నల్లమోతుల రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నిధులేవి ?



ఎర్రుపాలెంలో శిథిలమైన షాదీఖానా భవనం

శిథిలావస్థలో 'షాదీఖానా' భవనం

- వసతుల లేమితో అవస్థలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఏర్పాటుకు నోచుకోని నిర్వహణ కమిటీ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో నిర్మించిన షాదీఖానా భవనం ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక పూర్తిగా శిథిలమైంది. శిథిల భవనం నిర్వహణ విషయంలో అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేదనే విమర్శలున్నాయి. ఈ భవనం బాగుకోసం నిధుల మంజూరు విషయంలో అధికార యంత్రాంగం, పాలకులు శ్రద్ధ చూపడంలేదు.

ప్రజలు వినియోగించుకునేందుకే..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల ప్రజలు పలు రకాల ఫంక్షన్లకు, అధికార యంత్రాంగం సమావేశాల నిర్వహణకు.. వినియోగించుకునేందుకు వీలుగా ఈ భవనాన్ని నిర్మించారు. 2003 సంవత్సరంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం రూ.10 లక్షల నిధులతో అప్పటి పాలకులు శంకుస్థాపన చేశారు. 2007న డిసెంబర్ 20న అప్పటి కేంద్రమంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, అప్పటి రాష్ట్రమంత్రులు రెడ్యానాయక్, సంభాని చంద్రశేఖర్‌లు లాంఛనంగా ప్రారంభించారు.

మూనాళ్ల ముచ్చటే..

భవన నిర్మాణ సమయంలోనే అప్పటి కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా నిర్మించారు. దీంతో నిర్మాణం పూర్తైన మూడేళ్లకే భవనం శ్లాబు పెచ్చులూడింది. పలుచోట్ల పగుళ్లు ఏర్పడటంతో పాటు భవనం ప్రహరీ గేటు విరిగింది.. కిటికీలు లేవు. ఫ్యాన్లు పాడయ్యాయి. మూత్రశాలలు.. మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. భవనం మెట్లు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ మీటర్ బోర్డు లేదు. శిథిల షాదీఖానా భవనంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

నిర్వహణ కమిటీ లేక..

భవన నిర్మాణం పూర్తై రెండు దశాబ్దాలు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం షాదీఖానా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయలేదు. భవనం శిథిలం కావడంతో పెళ్లిళ్లు, ఇతరత్రా ఫంక్షన్ల నిర్వహణకు ప్రజలు దూరం అవుతున్నారు. రూ.30 వేల నుంచి రూ.50వేలకు పైగా ఖర్చు చేసి ప్రవేట్ ఫంక్షన్ హాళ్లను వినియోగించాల్సిన దుస్థితి నెలకొంది. పేదల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. షాదీఖానా భవన నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా నేటికి తగిన చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారయంత్రాంగం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

షాదీఖానా భవనం మరమ్మతులకు గురైన విషయాన్ని పరిశీలించి శాఖాపరంగా అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటాం. భవనానికి మరమ్మతులకు నిధులు మంజూరు విషయం ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– ఉషాశారద, తహసీల్దార్, ఎర్రుపాలెం

కమిటీ ఏర్పాటు చేయాలి..



మండలకేంద్రంలోని షాదీఖానా భవన నిర్వహణ కోసం కమిటీని ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలి. అప్పట్లో ఈ భవన నిర్మాణం మంజూరు కోసం చాలా కష్టపడ్డాం. మరమ్మతులకు నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. శిథిల భవనంలో ఫంక్షన్లు జరుపుకోలేకపోతున్నాం. మరమ్మతులకు నిధులు మంజూరు చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– షేక్ లాల్‌మహ్మద్, ఆటో కార్మికుడు, ఎర్రుపాలెం

పాలకులు స్పందించాలి..



షాదీఖానా భవనం శిథిలమై దశాబ్దాలుగా గడుస్తున్నప్పటికీ దానికి బాగు చేసుకునేందుకు చర్యలు తీసుకునే విషయంలో పాలకులు, అధికారుల్లో ఏమాత్రం చలనం లేకుండా ఉంది. శిథిల భవనంలో వివాహాలు, ఇతరత్రా శుభ కార్యక్రమాలు జరుపుకోవడం లేదు. ప్రైవేట్ భవనాల్లో ఎక్కువ నగదు చెల్లించి ఫంక్షన్లు నిర్వహించుకోవాల్సి వస్తుంది. పేదలు బాగా ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి.

– షేక్ హుస్సేన్, రిటైర్డ్ ఉద్యోగి, మీనవోలు

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



మధిర: దెందుకూరు పాఠశాలలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్



సత్తుపల్లిటౌన్: స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్

మధిర/ఎర్రుపాలెం/సత్తుపల్లిటౌన్: లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఖమ్మం ఆర్డీఓ గణేష్, కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్ అధికారులకు సూచించారు. మధిర మండలంలోని దెందుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోతో పాటు.. ఎర్రుపాలెం మండలంలోని కండ్రిక, చొప్పకట్లపాలెం, మాముసూరు, జమలాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ గణేష్ పరిశీలించగా.. సత్తుపల్లిలోని జ్యోతి నిలయంలో గల స్ట్రాంగ్ రూం, ఉర్దూపాఠశాల పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అధికారులు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ప్రతి పోలింగ్ కేంద్రంలో నాలుగు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు, చార్జింగ్ పెట్టేందుకు సాకెట్లు ఉండాలన్నారు. స్ట్రాంగ్‌రూం వద్ద కమిషనింగ్ సదుపాయం, బారికేట్స్ ఏర్పాటు చేయాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద వాహనాల పార్కింగ్, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, టాయిలెట్స్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రాథమిక పాఠశాలకి రూ.25 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా మంజూరు చేయటం జరిగిందన్నారు. ఆయన వెంట తహసిల్దార్లు వెంకటేశ్వర్లు, ఎం.ఉషాశారద, యోగేశ్వరరావు, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఈఓ జి.శ్రీలక్ష్మి, ఎలక్షన్ డీటీ శివ, ఆర్ఐలు జాని, నరేష్, సర్వేయర్ నాగు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలపై దాడి కుట్ర గర్హనీయం



సత్తుపల్లి: మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

సత్తుపల్లి/వేంసూరు/పెనుబల్లి/కల్లూరురూరల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడికి కుట్ర జరగటం గర్హనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి తీవ్రంగా ఖండించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు దయానంద్‌తో కలిసి మాట్లాడారు. అదే విధంగా తుమ్మలపై దాడికి కుట్ర చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కమ్మ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చలసాని సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేంసూరు మండలంలోని మర్లపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, పెనుబల్లిలోని రంగారావుబంజర్‌లో, కల్లూరులో నిర్వహించిన సమావేశాల్లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఇటువంటి రాజకీయాలు జిల్లాలో ఎప్పుడూ లేవని, ఖమ్మంజిల్లా అంటేనే శాంతియుత జిల్లాగా పేరు ఉందన్నారు. అభివృద్ధికి చిరునామగా ఉన్న వ్యక్తిని రాజకీయంగా ఎదుర్కొలేక ఫోన్ ట్రాపింగ్ చేసి దాడులకు పాల్పడాలని ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ కమిషనర్ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, శివవేణు, గాదె చెన్నారావు, నారాయణవరపు శ్రీనివాస్,ఎండి కమల్‌పాషా, వినుకొండ కృష్ణ, మానుకోట ప్రసాద్, రవీందర్‌రెడ్డి, పింగళి సామేలు, కొత్తూరు ప్రభాకర్‌రావు, వేంసూరులోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసరి చంద్రశేఖర్ రెడ్డి, రాచూరి గంగరాజు, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గడిపర్తి రాంబాబు, కారుమంచి ప్రసాద్, మల్లెల్లి నరసింహారావు, వెంకటేశ్వరరావు, ఎండీ ఫైజుద్దీన్, బాబురావు, రామిరెడ్డి, సత్యం, కాంగ్రెస్ నాయకులు సోమరాజు సీతారామారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, అలుగోజు చిన్నస్వామి, కరీముల్లా, పంది వెంకటేశ్వరరావు, ఈడా కమలాకర్‌రావు, గూడూరు మాధవరెడ్డి, మాళోతు రాధాకృష్ణ, సూర్యదేవర రవికుమార్, పిల్లి నవజీవన్, మేకతొట్టి కాంతయ్య, చీకటి చిన్ననరసింహారావు, భాగం ప్రభాకర్‌చౌదరి, బైర్ల కాంతారావు, ఎస్‌కె తూరాబ్‌అలీ, ఎస్‌కె ఉస్మాన్, బంకా బాబు, బొప్పన శ్రీనాథ్, ఎస్‌కె బాజీ, కిషోర్, యాస శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద చర్యలను ఖండించాలి



మాట్లాడుతున్న అలవాల కరుణాకర్

సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం మతోన్మాద చర్యలు, వికృత చేష్టలను తీవ్రంగా ఖండించాలని ఎస్‌సీసీ జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్‌నగర్ ప్రార్థనా మందిరంలో.. ఎస్‌సీసీ మండల అధ్యక్షుడు రవికిరణ్‌పాల్ అధ్యక్షతన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల ఎస్‌సీసీ నాయకుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో మదర్‌థెరిస్సా స్కూల్‌ను కాషాయపు మూకలు ధ్వంసం చేయటాన్ని ఖండించారు. సిగ్గులేని పనులు చేస్తుంటే మీరు నమ్మిన దేవుళ్లు కూడా మెచ్చుకోరని, ఇకనైనా పనికిమాలిన పనులు మానేసి బుద్ధిగా ఉండాలన్నారు. ఈ నెల 29న ఎస్‌సీసీ రాష్ట్ర సదస్సు సత్తుపల్లిలోని శ్రీలక్ష్మిప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, ఎస్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌పాల్, జాతీయ అధ్యక్షుడు స్టీఫెన్ చిట్టిబాబు, నేషనల్ సెక్రటరీ జనరల్ సిల్వీయ జయదీప్ సంబూరి, జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో స్వరూప్‌రాజ్, రాష్ట్ర పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు పింగళి సామేలు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడు కె.ప్రసాద్, జాన్‌మార్క్, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ, దమ్మపేట మండలాల అధ్యక్షులు బి.వరప్రసాద్, పాల్‌రాజు, యోబు, ఐ.శ్రీనివాసరావు, కె.దేవసహాయం, మాథ్యూస్, యాకోబు, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అంకమ్మతల్లి తిరునాళ్లు



మైలపట్నం నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి తిరునాళ్లు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ తిరునాళ్లు శుక్రవారం నుంచి బుధవారం వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మైలపట్నం, పుట్టబంగారం కార్యక్రమాలు భక్తుల మధ్య నిర్వహించారు. 20న జలబిందెలు, పూలకప్పెర, 21న రెడప్పెర, 22వ తేదీన గ్రామ ప్రభబండి ఊరేగింపు, 23న ఉదయం 9 గంటలకు గండ దీపాలు, పెద్ద తిరునాళ్లు, అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 24వ తేదీన బద్దెగౌర్రె, చంద్రపట్నం, రాత్రి ఏడుగంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం – ఎర్రుపాలెం గ్రామాల మధ్య ఆర్చి వద్ద నిర్మించిన శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమం శుక్రవారం ఉదయం 8గంటల 10 నిమిషాలకు వేద మంత్రాలతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఎర్రుపాలెం పురోహితుడు కొత్తూరి రాజేష్ శాస్త్రి ఆధ్వర్యంలో పలువురు అర్చకులు మంత్రోచ్చారణలతో ప్రతిష్ఠ నిర్వహించగా.. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, చిన్నబీరవల్లి, జానకీపురం, తూటికుంట్ల గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వలన వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శాస్త్రి, ఏపీఓ కృష్ణకుమారి హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



కందుకూరులో నూతనంగా నిర్మించిన బీరప్ప దేవాలయం

వేంసూరు: మండలంలోని కందుకూరులో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి22 వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నారు. 20న మైలపట్నం, 21న బియ్యం కోటపట్టుట, జెల్లికి పోవడం, 22న స్వామి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణం నిర్వహించడంతో పాటు సుమారు 7వేల మందికి అన్నదానం నిర్వహించనున్నారు. ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బండి రామచంద్రరెడ్డి 2కుంటలకు పైగా భూమి వితరణ అందించగా.. హెటిరోడ్రగ్స్ అధినేత బండి పార్థసారధిరెడ్డి రూ.5 లక్షలు వితరణగా అందించారు. స్వామివారి విగ్రహాలను జుబ్బురు మహేష్ కుమార్తె, అల్లుడు లావణ్య, నిచ్చెల్ అందించగా.. ఆలయానికి కావల్సిన గ్రానైట్ పురేటి పుల్లయ్య, రావులమ్మ దంపతుల కుమార్తె, అల్లుడు కీమ పార్వతి, లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు అందించారు. ఆలయ ప్రధాన ద్వారానికి ఇరు పక్కల ఏర్పాటు చేసిన అక్క మహంకాళి, చెల్లెలు చంద్రావతి విగ్రహాలను అన్నే కృష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు నాగేశ్వరరావు, సుబ్బురు, చిన్న మహేష్ కుటుంబ సభ్యులు వితరణగా అందించారు. ఈ సదర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు భాగ్యనగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ..

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా శ్రీసీతా రామచంద్ర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 23 వరకు బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహన కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో మిల్లులో పని చేసే కార్మికులకు, పాదచారులకు వైరా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లయన్ నంబూరి రామారావు ఆర్థిక సాయంతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు చింతోజు నాగేశ్వరరావు, ముళ్లపాటి సీతారాములు, తాడికొండ రాము, కె.శ్రీధర్, నంబూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

భోజనం ప్లేట్లు పంపిణీ



దివ్యాంగులకు ప్లేట్లు అందజేస్తున్న వాసిరెడ్డి కృష్ణ ప్రసాద్

మధిర: అల్లీనగరం గ్రామానికి చెందిన వాసిరెడ్డి సూర్యనారాయణ, బేబీ సరోజినీ జ్ఞాపకార్థం మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో దివ్యాంగులకు శుక్రవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. వాసిరెడ్డి కృష్ణ ప్రసాద్, సృజన దంపతుల ఆర్థిక సహకారంతో మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రానికి భోజనం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ.. ప్లేట్లు, గ్లాసులు లేక గతంలో పిల్లలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి ఇచ్చిన మాట ప్రకారం సేవాసదనానికి సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న కూరాకుల గోపి, భవాని దంపతులకు శుక్రవారం ప్రవాస భారతీయుడు వేమూరి అజయ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యం, కొంత మేర నగదును ఆర్థిక సాయంగా అందించారు. గోపి, భవాని దంపతుల కుమారుడు చిన్న యశ్వంత్ (16 నెలలు) ఇటీవల ఇంటి ఆవరణలోని నీటి సంప్‌లో పడి మృతిచెందిన నేపథ్యాన బాలుడి కర్మఖండ కార్యక్రమానికి నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో నారపోగు నాగరాజు, ఇనపనూరి వెంకటేశ్వరరావు, మోటమర్రి బోధనచారీ, బండ్ల శ్రీను, నారపోగు తిరుపతిరావు తదితరులున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

మధిర: తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నివాసం ఉంటూ ఎన్నికల విధులు నిర్వహించబోతున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి షేక్ నాగూర్ వలి డిమాండ్ చేశారు. అదే విధంగా ఆంధ్ర సరిహద్దులో ఉన్న మధిర వంటి సరిహద్దు పట్టణాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం మధిర పట్టణంలో జరిగిన యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అనేక మంది ఏపీ ఉద్యోగులు సరిహద్దు పట్టణమైన మధిరలో నివసిస్తున్నారని, వారందరికీ ప్రస్తుత ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గందరగోళంగా మారిందన్నారు. మధిర పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలైన తునికిపాడు, శివాపురం, జొన్నలగడ్డ తదితర గ్రామాల స్థానికులైన ఉపాధ్యాయులు అనేకమంది తెలంగాణ రాష్ట్రంలోని మధిర మండలంలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులు నియోజకవర్గ కేంద్రంలోని రిటర్నింగ్ ఆఫీసర్ వద్దకు వెళ్లి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పనిచేసే మండలంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12బి ని సమర్పించే అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర విభజన అనంతరం ఎన్నికల సమయాల్లో సరిహద్దు ప్రాంతాల్లోని అనేకమంది ఇటువంటి ఉద్యోగులు గతంలో తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారని, అటువంటి పరి స్థితి పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వినోదరావు, వీరయ్య, యూనియన్ నాయకులు ఇబ్రహీం , చెన్నయ్య, జీవీఎంఎస్ రాణి, కళావతి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



రైల్వే ట్రాక్‌పై నిరసన తెలుపుతున్న కార్మికులు

కారేపల్లి: విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్ రైల్వే సైడింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు మాధారం రైల్వే ట్రాక్‌పై శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఐఎఫ్‌టీయూ ప్రగతిశీల సింగరేణి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ షావలి, భారత కార్మిక సంఘాల సమైక్య ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడారు. మాధారం రైల్వే సైడ్ లైన్ కార్మికులకు నెలకు 26 పనిదినాలు కల్పించాలన్నారు. అనంతరం పదిమంది కార్మికులు సీఐటీయూ నుంచి ఐఎఫ్‌టీయూ యూనియన్‌లో చేరారు. చేరినవారిలో షేక్ పాషా, బాధావత్ వీరు, ఇస్లావత్ హుస్సేన్, షేక్ ఇబ్రహీం, జి.లక్ష్మీనారాయణ, బి.కళావతి, బి.వీరన్న, ఎస్.ప్రసాద్, ఎస్‌కే నాగుల్‌మీరా, జి.రవికుమార్ ఉన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కార్యదర్శి కోయల శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్ నాయకులు తేజ్యానాయక్, సక్రు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తల్లాడ విద్యుత్ శాఖాధికారి రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిదిలోని అన్ని గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని మామునూరు, రాజుల దేవరపాడు, బుచ్చిరెడ్డిపాలెం, చొప్పకట్లపాలెం, బనిగండ్లపాడు గ్రామాల్లో గ్రామాల్లో విద్యుత్ ఉండదని విద్యుత్ ఏఈఈ ఆర్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహించడానికి శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ సురేష్ తెలిపారు. ఈ కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్, తనికెళ్ల, బోడియా తండా, తుమ్మలపల్లి, అన్నవర, రామనర్సయ్యనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.